# మశూచి వ్యాధి తెలుపండి

— ఇచ్ఛాపురపు రామచంద్రం

ఎండ మండి పోతూంది.

నీడలేని రోడ్డుమీద - గుడ్డలేని వీపు మోసుకుంటూ, కరుగుతున్న తారు రోడ్డు మీద దిక్కు తోచకుండా తిరుగుతున్న నూకరాజుకి; భగ భగ మండే గాడి పొయ్యిలో నడక నేర్చుకుంటూ కాళ్ళు కొరకంచులు చేసుకుంటున్నట్లే ఉంది. ఐనా నడుస్తూనే ఉన్నాడు సీరసంగా.

అతన్ని - వేసవి ఎండకంటే మండించే మంటలనేకం ఉన్నాయి. అతని గుండె మండుతూంది. ఆకలితో కడుపు మండుతూంది. బాధ్యతలను తలుచుకుని - నిస్సహాయతతో అతని మనసు మండుతూంది.

ఇరవయ్యేళ్ళ నూకరాజుకి -

అమ్మ ఉంది. అయ్యున్నాడు. బావలు తన్ని తగిలేసి వదిలేసిన అప్పలున్నారు. బావల్లేని చెల్లెళ్లున్నారు. తమ్ముళ్లున్నారు. బుర్రలు లెక్కేస్తే ఎనిమిదౌతాయి. ఆ బుర్రలకి చెట్టుతొర్రలంతేసి నోళ్లున్నాయి. ఎటొచ్చీ ఆ నోళ్లకి బువ్వేలేదు. నూకరాజుకి లేనివి చాలా ఉన్నాయి.

తినడానికి తిండులేదు. ఉండడానికి గూడులేదు. కట్టడానికి మరో గుడ్డ ముక్కలేదు. చెయ్యడానికి పని (దొరకడం) లేదు. ఈ మనుషుల సంగతేమిటో వాడి కెంతకీ అంతు బట్టడంలేదు. అడుక్కోబోతే - 'దుక్కలా ఉన్నావు. పోయి పన్జేసుకోలేవు?' అంటారు. పనిమ్మంటే ఇవ్వరు. అతనికి- తనవాళ్లందరికీ 'ఓ పూటయినా నోటినిండా గెంజో అన్నమో పొయ్యాలని తాపత్రయం. వాడి గుండెలమీద ఆ కుటుంబం బరువంతా ఉంది. అది మొయ్యలేక వాడు కుయ్యోమంటున్నాడు. కుర్రగాడిదమీద వెర్రి బరువులా వాడిమీద వాడి కుటుంబం బరువు.

ఎప్పుడో చదివిన మూడో క్లాసు.... ఏపుగా పెరిగిన వొళ్లు.... ఏదీ యింత తిండి పెట్టలేదే అని వాడు తెగయిదయిపోతూ, పని దొరుకుతుందేమో అని పొద్దుటినుంచీ వెదదిరుకుతున్నాడు. పని మాత్రం దేవుడిలా - కనపడకుండా పోతూంది.

ఉన్నవాళ్ళు ఏ. సి. లో ఎండాయి



చేస్తుంటే — లేనివాళ్ళు ఎండకో యాతన పడుతున్నారు. పట్టి కాళ్ళతో.. వొట్టి గుండెతో.... వొట్టి కడుపుతో తిరిగి తిరిగి — ఒకచోట ఆగిపోయాడు. అక్కడ కొంచెం నీడగా ఉంది, ఎదురుగా మున్సిపల్ ఆఫీసుగోడ ఉంది. దానిమీద తలకాయంతేసి అక్షరాలతో ఏదో ఎర్రగా వ్రాసిఉంది.

చదువు నేర్చుకునే వాడు సినిమా స్లయిడ్స్ చదవాలని కుతూహలపడ్డట్టు వాడా పెద్ద అక్షరాలు చదవాలని సరదా పడ్డాడు. అందుకు కారణం - వాడికి పనిలేక పోవటం. తరువాత .... వాడికి తను ఆ ఎర్ర అక్షరాలు చదవగలడో లేడో తేల్చుకు చూడాలనిపించడం.

కష్టపడి .... ఒక్కొక్క అక్షరమూ చదివాడు - చాలాసేపటికి "మశూచి వ్యాధి తెలుపండి". తెలిపితే? అనుకున్నాడు. కింది అక్షరాలలో జవాబు దొరికింది. "వెయ్యి రూపాయలు గెలవండి."

మునిసిపాలిటీవాళ్ళ భాషనీ,భావాన్నీ సరిగానే గ్రహించగలిగాడు నూకరాజు. వాడికేదో అనుమానం వచ్చినట్లయింది. మళ్ళీచదివాడు. నిజమే అని నమ్మకం కుదిరినట్లు అక్షరాలవంక చూస్తూ తల పంకించాడు.

వెయ్యి రూపాయలు! దెబ్బకి దరిద్రం తీరిపోతుంది.

నిజానికి,వెయ్యిరూపాయలంటేఎంతో సరిగ్గా వాడికి తెలియదు. ఎక్కువ అని మాత్రం తెలుసు. వాడి కనిపించింది- ఎయ్యి రూపాయలంటే—రెండు పూటల కాదు ముప్పూటలా ముద్ద తినొచ్చు. చెట్టుక్రింద నుంచి చుట్టు గుడిసెలోకి మారొచ్చు. చిరుగ్గుడ్డలు మానేసి సిల్కు గుడ్డలుకట్టొచ్చు. ఏ టీ బడ్డీయో పెట్టుకుని హాయిగా బతకొచ్చు. ఎయ్యి రూపాయలుంటే-ఒక టేటి? లచ్చ జెయ్యొచ్చు.

మశూచంటే ఏంటి చెప్మా? ... అమ్మోరు... పెద్దమ్మోరు ... పెద్దమ్మోరున్నయిల్లు చెబితే ఎయ్యి రూపాయలు!...నిజంగా యిస్తారా? ఇస్తారు. ఎందుకివ్వరు? అంతలేసి అక్షరాల్లో రాశారుకదా?

నూకరాజు నీరసం ఎగిరిపోయింది. ఓపికొచ్చేసింది. ఉరికేశాడు-మంటలాటి ముండుటెండలోకి. ఇక వాడికి వొళ్ళు తెలియదు.

మశూచి వ్యాధి మోహినీ, వెయ్యి రూపాయలూ సుధాభాండమూ అయ్యాయి వాడి పాలిట. వీధులన్నీ తిరిగాడు కాళ్ళరిగేలా. జ్ఞానోదయం అయింది. జబ్బులు. వీధుల్లో ఉండవు. గుడిసెల్లో-జబ్బులేని గుడిసెల్లో ఉంటాయి. వాడు మురికి వాడల వేపు పరుగెత్తాడు. వాడి మతి ఎప్పుడో స్తిమితం తప్పింది. వాడు మశూచి మంత్రం జపిస్తున్నాడు.




వ్రతంవెర్రిలోపడి ఫలం మరచినట్లే ఉన్నాడు. కలలోలాగో కథలోలాగో ఏ దేవుడిలాటివాడో ఎదురై "నీకేం కావాలో కోరుకో" అని అడిగినా వాడు- "మశూచి" అనేటట్లున్నాడు. కాని వెయ్యి రూపాయిలు" అనేటట్లులేడు. మేనమామ చెవిలో వెంట్రుకలు మొలవాలని కోరుకునే మూర్ఖుడిలా ఉంది వాడి మశూచి వాలకం. కాళ్ళూ, కాళ్ళపీకూ తనవని వాడికి తెలియడంలేదు. కాలిపోతున్న శరీరమూ ఎండిపోతున్న నోరూ తనవే అని వాడు కానుకోలేకపోతున్నాడు.

మురికి వాడలో వాడికి రకరకాల మనుషులెదురయ్యారు. లాటరీ టిక్కెట్లమ్మి పొట్ట పోషించుకుందామనుకునే ఏజంటు, రూపాయితో లక్షాధికారులై పోదామని ఆ పూట కూటికి సిళ్ళాడిలి అరబ్బులతో టిక్కెట్టుకొనుక్కుంటున్న అలగాజనం;

క్రాసెడ్ చీటీలు వ్రాసేవాళ్ళు, రాయించుకునేవాళ్ళు .... అదృష్టానికి అడ్డుదార్లు వెదుకుతున్నవాళ్ళు.

"ఇక్కడ మశూచుందా ?"

"మీ యింట్లో మశూచుందా ?"

అడుగుతునే ఉన్నాడు నూకరాజు. కొందరు — పిచ్చివాడని జాలిపడ్డారు. మరికొందరు కోపంగా కసిరి - తిట్టి కొట్టినంత పనిచేశారు. అయినా వాడు లెక్కచెయ్యలేదు. మశూచిని వదల్లేదు, నిందలూ నిష్ఠురాలూ భరించాడు. పట్టుదలగా తిరిగాడు - సాయంత్రం అయ్యే వరకూ.

వాడి కాళ్ళు తేలిపోతున్నాయి.

కళ్ళు తిరుగుతున్నాయి.

నోరెండి పోయింది. ఇక వాడికి "మశూచి" అనడానికూడా నోరు పెగలడంలేదు. ఎటు పోతున్నాడో తెలియకుండానే గాలిలో తేలిపోతున్నట్లు వెళ్ళి వెళ్ళి - తల్లి వళ్ళో కూలిపోయాడు కుప్పగా.

ముసలి తల్లి తృళ్ళి పడింది. కేక వేసింది.

నలుగురూ పోగయ్యారు శోకంలాటి ముసల్దానికేకకి.

"నా బిడ్డ.... అగ్గిలా మండిపోతన్నాదీడివొళ్ళు" ఏడిచింది.

ఎవరో ఆచారి దగ్గరికి పరుగెత్తారు. ఆచారంటే ఎమ్. బి. బి. యస్ డాక్టరు కాదు. అలగా జనానికి చవక మందు లిచ్చే చదువుకోని డాక్టరు.

నూకరాజు మన లోకంలోలేడు. మశూచిలోకంలో ఉన్నాడు. వాడి మెదడులో ఎందరెందరో మశూచి వాళ్ల నాట్యాలు చేస్తున్నారు. వెయ్యి రూపాయలనోట్లవర్షం కురిపించేస్తున్నారు మునిసిపాలిటీవాళ్లు. వాడికి వెర్రి ఆనందంగా ఉంది.

"జొరం-" అన్నారెవరో నూకరాజు వొంటిమీద చెయ్యేసి చూసి. ఆ మాట

నూకరాజుకి వినిపించినట్లు కళ్లు తెరిచాడు. అంతవరకూ కన్నకల చెదిరినందుకు చింతిస్తున్నట్లు ముఖం ముడుచుకున్నాడు. అంతలోనే ఏదో ఆలోచన వచ్చినట్లు ఆనందంగా నవ్వాడు.

'మశూచొచ్చేముందు జ్వరమొస్తుందట్ట.... నాకొచ్చిన జ్వరం మశూచ య్యేలాచెయ్, నల్ల మారెమ్మ దేవతా నీకు నల్లకోడి కోస్తారు మా వాళ్ళు' గొణుక్కుంటూ గాలిలోకి దండాలు పెట్టాడు.

ముసలి తల్లి కంగారు మరింతెక్కువయింది.

ఈ సారి అరుపులే మొదలు పెట్టాడు నూకరాజు, 'నాకు జొరమొంటే మశూచి... మశూచంటే ఎయ్యి రూపాయిలు, నా కోసం ఏడవకండి. అమ్మా. అయ్యా.... అప్పలూ ... చెల్లెళ్ల .... తమ్ముళ్లు... లగెత్తుకెళ్ళి మునిసిపాలిటీ వాళ్ళకి నాకు మశూచని జెప్పి ఎయ్యి రూపాయిలూ తెచ్చుకొని సుకంగా ఉండండే. అమ్మా.... ఏనుగులాటి కొడుకెళ్ళి పోయాడనేడవకు. ఈ యేనుక్కి బతికుంటే ఏగానీ యిలువ లేదు. మశూచితో చస్తే ఎయ్యి రూపాయల యిలువ, ఎల్లండెల్లండి నాకు మశూచని జెప్పి ఎయ్యి రూపాయలు తెచ్చుకోండి.

పేదవాళ్ళకి పేదపెళ్ళాల్లా పేదవాళ్ళకి పేద డాక్టరయిన ఆచారి రానే వచ్చాడు.

"సంధి -" అన్నారెవరో.

ఆ మాట ఆచారి వినిపించుకోలేదు.

నూకరాజు చేతిని తనచేతిలోకి తీసుకుని నాడి చూడసాగాడు.


"మశూచి" అన్నాడు నూకరాజు.

" కాదు. వడదెబ్బ. " అన్నాడు ఆచారి కచ్చితంగా.

తుపాకి దెబ్బలా తగిలింది ఆ మాట నూకరాజుకి,

'మశూచి కాదూ? మా వాళ్ళకెయ్యి రూపాయిలు రావూ?" అనేసి - విచారంగా బాధగా కళ్లు తేలవేశాడు.

"చచ్చిపోయాడు." అని అధికారికంగా చెప్పేసి తనవిధి నిర్వర్తించేసుకున్నాడు డాక్టరు. ❋



# ఏ దేశచరిత్ర చూసినా...

## —సాహితి

పేరెందుకుగాని, అదో చరిత్ర ప్రసిద్ధి గాంచిన వూరు. శిల్పసంపద రాశిపోసి వుంది, విదేశీయులు సైతం మురిసిపోయి, మెచ్చుకుంటూ వుంటారు. "అసలు వారు మెచ్చుకుంటేనే కదండీ మనవారి గొప్ప మనకి తెలిసేది." ఈ మాట కేశవరావు కాస్త కోపంగా అంటూ వుంటాడు. అతగాడు చరిత్ర విద్యార్థి. మన రాజులు, రాణులు, కవిగారన్నట్టు వారి ప్రేమపురాణాలు—వగైరా విషయాలు చదువుతుంటే మంచి థ్రిల్లింగ్‌గా వుంటుందతనికి. ఆ కాలంలో పుట్టక పోతినే అని విచారంగానూ వుంటుంది. అతని స్నేహితుడు రాఘవరావు కిది నచ్చదు. గతాన్ని అవగతం చేసుకొని అంతటితో వదలడమే గాని అనుసరించడం హాస్యాస్పదమని అతని అభిప్రాయం. ఆఖరి పరీక్షరాసి చేతులు దులుపుకొంటుంటే, వారి విదేశీ మిత్రుడు రాబర్ట్ వచ్చాడు. "శిలవుల్లో ఎక్కడికి కెళ్తున్నారంటూ?" "ఇంకా ఏం తేల్చుకోలేదన్నాడు" కేశవరావు. చరిత్రలో గొప్ప పేరొందిన ఆ వూరు పేరుచెప్పి వెళ్ళి చూసి రండని సలహా యిచ్చాడు." ఏం శిల్పమయ్యా బాబూ! అఖండులు కదా మీ భారతీయులు, అక్కడ ఓ మండపంలో ఒక నాట్యకత్తె శిల్పం వుంది, అబ్బ! ఏం సౌందర్యం! బ్రహ్మాండంగా చెక్కాడనుకో, మరి వదిలి రాబుద్ధి కేదు లేదు. అహా! నిజంగా ఎవరూ లేకుండా చూసి, ముద్దు పెట్టేసుకొన్నాననుకో! చూసి తీరవలసిన శిల్పం" రాబర్ట్ అరమోడ్పు కన్నులతో ఆ అనుభూతి యొక్క పారవశ్యాన్ని మిత్రులిద్దరి ముందూ ప్రవర్శించేడు. కేశవరావు వళ్ళు ఝల్లుమంది, రోగిముందు పిండివంటల గురించి వర్ణిస్తున్నట్టే వుంది. రాఘవరావులోనూ కుతూహలం రేకెత్తింది. "ఇన్నాళ్ళూ చూడకపోవడం పెద్దతప్పు. పదరా" అన్నాడు కేశవరావు. "యూనివర్శిటీ మూత పడనీ" అన్నాడు రాఘవ. పరీక్షలైన మరునాడు పెట్టెలు లేవుగాని బెడ్డింగ్‌లు మాత్రం సర్ది రైలెక్కేరు.